www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 16 మార్చి 2025



ఇంటింటా కేన్సర్ స్క్రీనింగ్ సర్వే

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నాన్-కమ్యూ నికబుల్ డిసీజెస్(ఎన్‌సిడి) 3.0 కార్యక్రమంలో భాగంగా శనివారం బంట్రోతులు వారి వీధి, భీమవరం ప్రాంతాన్ని సందర్శించి, ఇంటి ఇంటికీ సర్వేలు నిర్వహించారు. డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి (ప్రోగ్రామ్ ఆఫీసర్-ఎన్‌సిడి), గాతల సుభాష్ (జిల్లా ఎపిడెమియాలజిస్ట్) ఈ సర్వేల్లో నోటి, గర్భాశయ, స్తన కేన్సర్ల స్క్రీనింగ్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సర్వేలో ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

స్వచ్ఛాంధ్ర ర్యాంకింగ్స్‌లో..

పశ్చిమకు 24, ఏలూరుకు 15వ స్థానం



చెత్తను ఎత్తి బుట్టలో వేస్తున్న సిఎం చంద్రబాబు

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపు

సింగిల్ వాడకం ప్లాస్టిక్‌ను తరిమికొడదాం


తణుకులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

కార్మికులకు సన్మానం, జ్ఞాపికలు అందజేత

సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఎగబడిన జనం

తణుకు నియోజకవర్గ అభివృద్ధి పనుల నిధులకు సిఎం హామీలు

టిడిపి, కార్యకర్తల, నాయకులతో ప్రత్యేక సమావేశం, దిశానిర్దేశం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల, ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తణుకు, రూరల్

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రతి విభాగంలో పనితీరు ఆధారంగా ర్యాంకింగ్స్ తయారు చేశామంటూ రాష్ట్రంలో 26 జిల్లాలకు సిఎం ప్రకటించిన ర్యాంకుల్లో పశ్చిమ 97 పాయింట్లతో 24వ స్థానం, ఏలూరు 108 పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాయి. జపాన్ వంటి దేశాల్లో రోడ్డుపై చెత్త వేయరని, మనకూ అలాంటి అలవాట్లు రావాలని తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులో సిఎం పర్యటించారు. ఉదయం తొమ్మిది గంటలకు హెలీకాప్టర్‌లో తణుకు చేరిన సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా ఎన్‌టిఆర్ పార్కు, కూరగాయాల మార్కెట్, ఐక్యనగర్‌లో సిఎం పర్యటించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్త ఊడ్చి ఎత్తిపోశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. కూరగాయల మార్కెట్‌లో వేస్టేజ్‌ను ఎరువుగా మార్చే యంత్రాలను పరిశీలించారు. ఐక్యనగర్‌లో పి4 విధానంలో అభివృద్ధి పనులు, పార్క్ నిర్మాణంపై అక్కడి జనంతో మాట్లాడారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వేదిక ప్రాంగణానికి చేరుకుని ముందుగా అక్కడ ఏర్పాటు చేసి వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను పరిశీలించి వేదికపైకి సిఎం చేరుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఒక్కసారి వాడి పారవేసిన ప్లాస్టిక్‌ను నిషేధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అమల్లోకి తెస్తున్నామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో మౌలిక సదుపాయాల కొరత ఉందని, కలెక్టరేట్‌ను ప్రజల భాగస్వామ్యంతో నిర్మించుకునే విధంగా చేయాలని సిఎంను కోరారు. భీమవరాన్ని అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులు రమణ, దుర్గావెంకటేష్, గంగాధరరావులతోపాటు, పరిశుభ్రతపై విశేష సేవలందిస్తున్న సూర్యచంద్రరావు, వనజ, గాదం లక్ష్మిని శాలువ కప్పి, జ్ఞాపికతో సిఎం సత్కరించారు. ప్రజావేదికలో పాల్గొన్న నర్సింగరావు, భాస్కరరావు, నందినితో సిఎం ముఖాముఖి మాట్లాడారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, ఇళ్లతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామానాయుడు, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, నాయకులు, కార్యర్తలు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు



స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడుతున్న సిఎం



మెమెంటో అందజేస్తున్న చంద్రబాబు

తణుకు నియోజకర్గ అభివృద్ధి పనులకు సిఎం హామీలు

ప్రజావేదిక కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు నియోజకర్గంలో పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆటోవర్కర్స్, మెకానిక్‌లు దాదాపు ఐదు వేల మంది ఉన్నారని, అటో నగర్ ఏర్పాటుకు రూ.ఆరు కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇళ్లస్థలాల విషయంలో దోపిడీ జరిగిందని, నిడదవోలుకు దగ్గర కాపవరంలో 23 ఎకరాలు కొనుగోలు చేసి 1,333 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారని, దూరం కావడంతో లబ్ధిదారులు ఎవరూ ఇళ్లు కట్టుకోలేదని వారందరికీ న్యాయం చేయాలని కోరారు. టిడ్కో ఇళ్లు ఇవ్వాలని అడిగారు. తణుకులో ట్రాఫిక్ నిలిచిపోతోందని, కెనాల్ బండ్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి రూ.20 కోట్లు ఇవ్వాలని సిఎంను ఎంఎల్‌ఎ కోరారు. అంతేకాకుండా సమ్మర్ స్టోరేట్ ఏర్పాటు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి నిధుల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. మెయిన్ ఆర్‌అండ్‌బి రోడ్డుకు నిధులు, బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరారు. దీనిపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ రాధాకృష్ణ డైనమిక్ ఎంఎల్‌ఎ అని, తన నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కోరారన్నారు. తణుకు మున్సిపాల్టీ అభివృద్ధికి కృషిచేసిన ముళ్లపూడి హరిశ్చంద్రరావును గుర్తుచేసుకోవాల్సి ఉందని సిఎం తెలిపారు. తణుకు మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. నేషనల్ హైవే గ్రాంటుతో ప్రధాన రహదారి పనులు చేసుకోవచ్చన్నారు. జిఎన్‌వి కెనాల్ బండ్, ఆటోనగర్‌తోపాటు, ఎంఎల్‌ఎ అడిగినా పనులకు నిధులిస్తామన్నారు. తణుకు, భీమవరం రోడ్డు అభివృద్ధికి నిధులిస్తామన్నారు. జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని, ఇరిగేషన్ పనులు మంత్రి రామానాయుడు చూసుకుంటారన్నారు.

సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఎగబడిన జనం

ప్రజావేదికకు విచ్చేసిన పలువురు తమ వ్యక్తిగత సమస్యలపై సిఎంకు వినతులు ఇచ్చేందుకు ఎగబడిన పరిస్థితి నెలకొంది. ప్రజావేదికలో ఓ యువతి నందిని మాట్లాడుతూ తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, టెస్టులకు పరీక్షలకు చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయని, పింఛన్‌తోపాటు, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోవాలని సిఎంను కోరింది. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు సిఎం ఆదేశించారు. ఏసమ్మ అనే మహిళ తన కుమార్తెకు మతిస్థితిమతం లేదని, ఆర్యోగ ఖర్చుల భరించలేకపోతున్నామని, ఆదుకోవాలని కోరింది. ఎంఎల్‌ఎను కలవాలని సిఎం తెలిపారు. సిఎంఎ తన ప్రసంగం ముగించుకుని వెళ్లిపోయేటప్పుడు చాలా మంది తమ సమస్యలపై వినతులు సిఎంకు ఇచ్చేందుకు పెద్దఎత్తున గుమిగూడి ఎగబడ్డారు. సిఎం ఆగి చాలా మంది వద్ద వినతులు తీసుకున్నారు. వినతులు ఇవ్వలేని కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారు.

టిడిపి నాయకులు, కార్యర్తలకు దిశానిర్దేశం

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం ప్రత్యేకం సమావేశమయ్యారు. ఈకార్యక్రమానికి మీడియాకు అనుమతి లేదు. దాదాపు గంటన్నరకు పైగా ఈ సమావేశం సాగింది. అంతర్గత సమాచారం ప్రకారం తాను బాగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని, అదేవిధంగా మీరుకూడా ఉండాలని సిఎం చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అందుకే ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలతో సమావేశం పెడుతున్నానని తెలిపారు. గడిచిన ఐదేళ్లతో అంతా ఇబ్బంది పడ్డామన్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ చాలా కష్టాలు చూస్తున్నానన్నారు. సమస్యలు ఎలా పరిష్కరిస్తారని అంతా అడుగుతున్నారు. దానికి ఒకటే మార్గం.. పారిపోవడం, ఫైట్ చేయడం అన్నారు. అఫైట్ నేను చేస్తున్నానని తెలిపారు. ఎక్కడైనా కార్యకర్తల కాంట్రాక్ట్ బిల్లులు రాజకీయంగా ఆపి ఉంటే చర్యతీసుకునే బాధ్యత మంత్రులు, ఎంఎల్‌ఎలదే అన్నారు. అనుభవం, పరిగెత్తే యువత పార్టీకి అవసరమన్నారు. ఆ విధంగానే పదవులు ఇస్తున్నట్లు తెలిపారు. పార్టీకి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే ఒకటి, రెండుసార్లు చూస్తా, తర్వాత చర్యలు గట్టిగా ఉంటాయని హెచ్చరించారు. ఈసారి మహానాడు కపడలోపెడుతున్నామని తెలిపారు. అంతా ఎప్పుడూ 2029 ఎన్నికల్లో గెలుపుపైనే దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పనితీరు బాగాలేని కస్టర్ ఇన్‌ఛార్జులను సిఎం మందలించినట్లు సమాచారం. నా చుట్టూ తిరిగితే లాభంలేదు.. మీ పని ప్రజలు చుట్టూ తిరుగుతూ ఓట్లేయించడం.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అన్నారు.

9 నెలల పాలనలో ఎంతో అభివృద్ధి

రూ.2.80 కోట్లతో ఉల్లంపర్రులో అభివృద్ధి పనులు

మంత్రి నిమ్మల రామానాయుడు



పొక్లెయిన్‌తో పనులు ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ తొమ్మిది నెలలపాలనలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుతున్నాయని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామంలో రూ.8.34 లక్షలతో కొంతేరు ఛానల్‌పై మట్టి పూడిక తొలగింపు పనులను మంత్రి నిమ్మల శనివారం ప్రారంభించారు. మంత్రి పొక్లెన్‌ను స్వయంగా నడిపి పంట కాలువలో మట్టి పూడిక తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపికి కంచుకోటగా ఉన్న ఈ గ్రామంలో మొత్తంగా రూ.2.80 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల గురించి వివరించారు. రైతు బిడ్డగా రైతాంగానికి అవసరమైన పనులు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఎకరానికీ సాగునీరందేలా పనులు చేపడుతున్నామన్నారు. అన్నదాతలు పొలం వెళ్లేందుకు గ్రావెల్ రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం వ్యవసాయాన్ని, రైతులను గాలికి వదిలేసిందన్నారు. కొందరు మహిళలు గత ప్రభుత్వంలో తమ గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కలతిప్పలో నిరుపయోగంగా ఉండే ఇళ్ల స్థలాలు ఇచ్చారని, తమ గ్రామంలోనే స్థలాలు ఇప్పించాలని మంత్రి రామానాయుడును కోరారు. పనికిరాని స్థలాలు ఎందుకు తీసుకున్నారని, ఆనాడే వద్దంటే మన ప్రభుత్వంలో ఇచ్చే వాళ్లమని మంత్రి తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతిస్తూ పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ నారాయణరావు, ఎఇ.శ్రీనివాస్, పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షుడు పెనుమత్స రాంబద్రరాజు, సాగునీటి సంఘాల అధ్యక్షులు టి.కృష్ణ, మాత రత్నరాజు, ఇంటి శ్రీరాముడు, దేవరపు దొరబాబు, పాసర్ల వెంకటరమణ, పాసర్ల సింహాచలం, రావాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు

ఆచంట ఎంఎల్‌ఎ పితాని



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

పలు గ్రామాల్లో అక్రమంగా వేసిన లే అవుట్లను ఆయా పంచాయతీలు 14 శాతం రుసుము చెల్లించి, వెంటనే క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం అంగీకరించిందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం పెనుమంట్ర మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకై ప్రభుత్వాన్ని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. గతంలో శాంక్షన్ అయిన గృహాలు వెంటనే నిర్మించుకుంటే, అదనంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేల ఆర్థిక ప్రయోజనం ప్రభుత్వం కలిగిస్తుందని పితాని పేర్కొన్నారు. స్థానిక ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో మంచి నీటి, సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, విద్యుత్ సమస్యల లోఓల్టేజీలను నివారించాలని ఆయన కోరారు. జడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి పలు మండలంలోని సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టిలో పెట్టారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు ఇ.అనిత, వి.కిరణ్, తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ పి.సామ్యూల్, వ్యవసాయశాఖ అధికారి ఎ.జ్యోషిలా, పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పేదవాడు ఉన్నత చదువులు చదవాలి

పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు

భీమవరం టౌన్ : పేదవాడు ఉన్నత చదువులు చదివితే దేశానికి, రాష్ట్రానికి ఎంతగానో మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం సాగి రామకృష్ణంరాజు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల 45వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ దేశంలో యువత కొరత పెరుగుతుందని, ప్రస్తుతం ఉన్న యువతకి ఉన్నత అవకాశాలు లభిస్తాయని, దీనిని విద్యార్థులు, యువత గమనించాలని అన్నారు. ఎంత నిరుపేదైనా క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని, తాను ఆవిధంగా ఎందరో విజయాలు సాధించిన యువతను గమనించానని ఆయన పేర్కొన్నారు. కళాశాల వ్యవస్థాపకులు, కీర్తిశేషులు సాగి రామకృష్ణంరాజు గ్రామీణ ప్రాంతమైన చిన అమిరంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి ప్రపంచానికి ఉత్తమ ఇంజనీర్లను అందించారని పేర్కొన్నారు. భీమవరం ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా మారటంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఒకటిగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అకాడమిక్ విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించారు. సిఎస్ఇలో 9.71 పర్సెంట్ మార్కులు సాధించిన బంక ధార్మిక్ వివిధ విభాగాల్లో కనబరిచిన ప్రతిభకు మూడు బంగారు పథకాలు సాధించి రికార్డు సృష్టించారు. వీరితోపాటు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు నగదు బహుమతితో సత్కరించారు. రాష్ట్రస్థాయి అధ్యాపక క్రికెట్ టోర్నమెంట్లో నాలుగు సార్లు విజేతగా నిలిచిన కళాశాల అధ్యాపక క్రికెట్ టీంకు రూ.80 వేల విలువైన క్రికెట్ కిట్ అందించారు. అదేవిధంగా కళాశాలలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి బయటకు వెళ్లిన 26 మంది విద్యార్థులకు బంగారు, రజిత పథకాలతో పాటు నగదు బహుమతులు కూడా అందించారు.

స్వర్ణాంధ్రలో 2 నుంచి పాలిటెక్నిక్ శిక్షణ

మెటీరియల్‌తో పాటు ఉచిత ట్రాన్స్‌పోర్టు సౌకర్యం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతా రామపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రియల్ 2వ తేదీ నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కె.వెంకటేశ్వరస్వామి తెలియజేశారు. శనివారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఈ శిక్షణకు సుమారుగా 500 మంది పదవ తరగతి విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారని, వీరికి ఉచిత మెటీరియల్‌తో పాటు ఉచిత ట్రాన్స్‌పోర్టు కూడా ఇస్తున్నామన్నారు. వీరికి ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తామని పాలిసెట్-25 పరీక్షలో నిర్వహించే ఒఎంఆర్ నమూనా పరీక్ష కూడా నిర్వహిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులకు పాలిసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు చేయడం దగ్గర నుంచి కౌన్సిలింగ్ వరకు కూడా గైడ్ చేస్తామని తెలియజేశారు. పాలిసెట్ పరీక్ష గత రెండు సంవత్సరాల నుంచి స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో జరుగుతున్నా విషయం అందరికీ తెలిసినదే. స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్‌లో డిఎఐఎం, డిసిఎంఇ, డిఇసిఇ, డిఇఇఇ, డిఎంఇ విభాగాలలో మొత్తం 429 సీట్లు అందుబాటులో ఉన్నాయని, పాలిసెట్ టెస్ట్ ద్వారా సీటు వస్తే 3 సంవత్సరాలు కూడా ఉచిత విద్య అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి ప్రగతి స్కాలర్ షిప్ ద్వారా సంవత్సరానికి రూ.50 వేలు మెరిట్ బేసిస్ మీద లభిస్తుంది. ప్రతి విద్యార్థికి ఆఖరి సంవత్సరంలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో నెలకు సుమారు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ స్టైపెండ్‌తో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తున్నామని తెలియజేశారు.

ప్రస్తుత సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025 నకు సంబంధించిన దరఖాస్తు నమోదు ప్రక్రియ ఈనెల 12వ తేదీన ప్రారంభమైందని, ఈ నమోదు ప్రక్రియ ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్లైన్ మోడ్‌లో కొనసాగుతుందన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన శిక్షణ, టెస్ట్‌లు, ఉచితంగా కాలేజ్ బస్సు సౌకర్యం ఏప్రిల్ 02 నుంచి 29 వరకు తమ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్‌లో చదువుకున్న విద్యార్థులకు డిప్లొమో తరువాత ఉద్యోగ అవకాశాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు కూడా కళాశాల మేనేజ్‌మెంట్ వారు కల్పిస్తున్నారని తెలియజేశారు. పదవ తరగతి పరీక్షకు వెళ్లే వారందరూ కూడా ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని 18 సంవత్సరాలకే ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్, డాక్టర్ పి.పండరీనాథ్, డిప్లొమో ప్రిన్సిపల్ డా.కిరణ్మయి, సిఎస్ఇ హెడ్ అఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల నిలయం.. అప్పుల వలయం

సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర బృందం వద్ద బాధితుల ఆవేదన

అండమాన్ జైలును తలపిస్తున్న టిడ్కో గృహాలు

జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 పట్టణాల మీదుగా 500 కిలోమీటర్లు సాగిన యాత్ర

80 గ్రామాల్లో 130కిపైగా ప్రభుత్వ కాలనీలు, 3 పట్టణాల్లో టిడ్కో ఇళ్లు సందర్శన

జిల్లాలో ముగిసిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర

17న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

సమస్యల నిలయం.. అప్పుల వలయంగా జిల్లా ప్రజానీకం దుస్థితి ఉందని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, పట్టించుకోవాల్సిన ప్రభుత్వాల ఉదాసీనంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల పట్టాలు ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలపై ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకూ సిపిఎం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర శనివారంతో ముగిసిందన్నారు. ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. వేల మంది ప్రజానీకం సైకిల్ యాత్ర బృందానికి సమస్యలు ఏకరువు పెట్టారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 పట్టణాలు సుమారు 80 గ్రామాల్లో సైకిల్ యాత్ర సాగిందన్నారు. సుమారు 130కి పైగా ప్రభుత్వ కాలనీలను సందర్శించామని తెలిపారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెంలోని టిడ్కో గృహాలను పరిశీలించామని తెలిపారు. అయితే ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాలు వివక్ష, నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. దీంతో బాధితుల ఆవేదన, బాధ వర్ణనాతీతమన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు లేక అలమటిస్తున్నారన్నారు. కనీసం పెన్షన్, రేషన్ పంపిణీ వంటి సౌకర్యాలు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడంతో వృద్ధులు, మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదిలాఉంటే ప్రభుత్వ గృహ నిర్మాణాలకు అందిస్తున్న సాయం ఎటూ సరిపోని పరిస్థితి ఉందన్నారు. ఒక గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ అప్పుల పాలవుతున్న పరిస్థితి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు రూ.500 కోట్లకుపైగా అప్పుల పాలయ్యారని తమ పరిశీలనలో తేటతెల్లమైందన్నారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో సుమారు 20,784 టిడ్కో గృహాలు నిర్మించినప్పటికీ కేవలం 8వేల మందికి మాత్రమే ఇళ్లు అప్పగించినట్లు తెలిపారు. ఎల్‌అండ్‌టి కంపెనీ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నిర్మాణాలు చేపట్టినప్పటికీ స్లాబు లీకేజీ లేని అపార్ట్‌మెంట్ లేదని విమర్శించారు. డ్రెయినేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు అనేకం ఇక్కడ తాండవిస్తున్నాయన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే టిడ్కో ఇళ్లు అండమాన్ జైలును తలపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గృహ ప్రవేశాలు జరగకుండానే లబ్ధిదారులు వెను తిరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మించుకున్న గృహాలకు నేటికీ బకాయిలు చెల్లించలేదని, ఇది ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. సొంత గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కావాలని ఎంతోమంది కోరుకుంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల భూమిని ఇళ్ల స్థలాలుగా ఇస్తామని హామీ ఇచినట్లు తెలిపారు. అయితే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో కనీసం దీని ఊసే తీయకపోవడం దారుణమన్నారు. ప్రతి గ్రామంలో 50 నుంచి 100 మంది వరకూ ఇళ్ల స్థలాలు లేనివారు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా వేల మంది ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణం ఇళ్ల పట్టాలు అందించాలన్నారు. ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఆ భూమిని ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం తొలగింపు చేపట్టడం అన్యాయమన్నారు. ఇది ఓటమి పాలసీనా లేక ఉండి నియోజకవర్గ పాలసీనా చెప్పాలన్నారు. చించినాడలో శ్మశాన సమస్య ఉందని ఇప్పటికే అధికారులు దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు వై.రాము, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతిబాబు పాల్గొన్నారు.

17న కలెక్టరేట్ వద్ద ధర్నా.. హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో వచ్చిన అనేక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు గోపాలన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున వేల మంది ప్రజలతో ధర్నా నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విజ్ఞాపనల రూపంలో కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూల నుంచి వేలాది మంది ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్యలపై ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే భవిష్యత్ కార్యాచరణ కూడా ప్రకటించి పోరుబాటకు సిద్ధమవుతామని గోపాలన్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి రేపు ధర్నా

విజయవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి – పెంటపాడు

ప్రభుత్వ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, పెంటపాడు గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని ఈనెల 17వ తేదీన భీమవరం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. శనివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిపిఎం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్ర సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ నాయకత్వాన నిర్వహించారన్నారు. జిల్లాలో ఉన్న 20 మండలాలు, ఆరు పట్టణాల్లో 500 కిలోమీటర్లు సైకిల్ యాత్ర ఈనెల 15వ తేదీ వరకు వందలాది గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ కాలనీలు, పట్టణాల్లో ఉన్న టిడ్కో గృహాలు సందర్శించి, అక్కడ ఉన్న మౌలిక సమస్యల మీద ఈనెల 17వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ పాదయాత్ర బృందానికి ప్రభుత్వ కాలనీలో అనేక సమస్యలు బృందం దృష్టికి తీసుకువచ్చారని, రోడ్లు సక్రమంగా లేవని, డ్రెయినేజీ వ్యవస్థ లేదని, నిర్మాణంలోనే చాలా ఇళ్లు పునాదుల్లోనే ఉన్నాయని, మరికొన్ని ఇళ్లు బేస్మెంట్ లెవల్‌లోనూ, కొన్ని ఇళ్లుస్లాబ్ వరకు వచ్చి ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షా 80 వేలు కొంతమంది వినియోగదారులకు సక్రమంగా అందలేదని, కట్టిన వారు కూడా అప్పులు చేసి ఇళ్లు నిర్మించారని వాపోయారు. ప్రభుత్వ కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ సహాయం అందించాలని, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్య, కరెంటు సమస్య పరిష్కరించాలని, పెంటపాడు గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య చాలా తీవ్రంగా ఉందని, ఆ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన వేలాది మందితో భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ప్రజానీకం కదలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో పనిచేయని టెలిఫోన్

ఇబ్బందిపడుతున్న ఫిర్యాదుదారులు

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్

పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ టెలిఫోన్ సుమారు 15 రోజుల నుంచి పనిచేయడం లేదు. దీంతో ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా విషయమే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయాలంటే ఫోన్ పనిచేయక, పోలీసువారికి సమాచారం అందివ్వలేక ఇబ్బంది పడుతున్నారు. ఫోన్ నెంబర్ పనిచేయటం లేదని పోలీస్ సిబ్బందికి తెలియజేసినా ఫోన్ ఇంకా పనిచేయకపోవడంపై ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏ విషయంపైన అయినా ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ చేయాలంటే ఆయన వివిధ పనులలో ఉంటారు. ఫోన్ ఎత్తవచ్చు, ఎత్తకపోవచ్చు. అదే ల్యాండ్ లైన్ పనిచేస్తుంటే సంబంధిత పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వడానికి అనువగా ఉంటుంది. దయచేసి వెంటనే పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్‌ను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి – పాలకొల్లు

కళలకు కాణాచిగా పేరుగాంచిన పాలకొల్లులో నాటక కళాపరిషత్తులు ఇంకా జీవం పోస్తున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు కళాపరిషత్ 16వ జాతీయ నాటికల పోటీలను అడబాల థియేటర్ వెనుక మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలకొల్లులోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రం నిర్మాణం ఇప్పటికే పూర్తి చేయవలసి ఉందని, టిడిపి హయాంలో 80 శాతం పనులు పూర్తి కాగా గత వైసిపి ఉన్న నిర్మాణాన్ని మెయింటైన్ చేయక శిథిలావస్థకు చేరింది అన్నారు. దీన్ని కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తుందని చెప్పారు. త్వరలో అక్కడక్కడ జరుపుకునే నాటక పరిషత్‌లు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వలె నిర్మించిన ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో జరుపుకుంటామని చెప్పారు. ఇంకా మాజీ ఎంఎల్‌ఎ అల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, సీనియర్ కళాకారులు మానాపురం సత్యనారాయణ, కెవి కృష్ణ వర్మ మాట్లాడారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ సోమవారం వరకు జరగనున్న టెన్త్ పరీక్షల కోసం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని మండల ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, యు.నాగేశ్వరరావులు శనివారం ఇక్కడ తెలిపారు. మండలం నుంచి ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ నుంచి 246 మంది బాలురు, 263 మంది బాలికలతో కలిపి మొత్తం 509 మంది పరీక్షలు రాయనున్నారని వారు వెల్లడించారు. మార్టేరు గ్రామంలోని ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బసంతీదేవి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పెనుమంట్ర, పొలమూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని వారు వెల్లడించారు.

పది పరీక్షలకు నాలుగు కేంద్రాలు

కాళ్ల : పదో తరగతి పరీక్షలు ఈనెల 17 నుంచి 31 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాళ్ల మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర శివరావు తెలిపారు. ఇందులో తొమ్మిది జెడ్‌పి ఉన్నత పాఠశాలలు, మిగతావి ప్రయివేటు పాఠశాలలని ఆయన చెప్పారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 743 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. కోపల్లె హైస్కూల్లో 250 మంది, కాళ్ల హైస్కూల్లో 250 మంది, ఏలూరుపాడు హైస్కూల్లో 230 మంది, కలవపూడి హైస్కూల్లో 13 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరు కానున్నారు.

కాళీపట్నంలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించామని వైద్యురాలు జె.నీలిమ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 83 మూగజీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేసామని నీలిమ తెలిపారు. ఈ సేవలో బస్సు వైద్య శాఖ సిబ్బంది సేవలు అందించారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ పంపిణీ

భీమవరం టౌన్ : పదో తరగతి పరీక్షలు సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో శనివారం 2 వేల పెన్నులు, ప్యాడ్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు అవసరమైన పెన్నులు, ప్యాడ్స్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ఉండి : ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించడం అభినందనీయమని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు అన్నారు. ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కుమారుడు భరత్ అన్నారు. మండలంలోని ఆరేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, కొండాలమ్మ, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. గ్రామ మాజీ సర్పంచి పిప్పిరెడ్డి పోలీశ్వర రావు అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం, ఎంపిటిసి మద్దాల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ

భీమవరం : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శనివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భీమవరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇళ్ల స్థలాల ప్రక్రియ జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి హెచ్.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రయాణానికి పరీక్ష..

సరైన రవాణా ఏర్పాట్లు లేక విద్యార్థుల ఆవేదన

ప్రత్యేక బస్సులు నడపాలని వేడుకోలు

ప్రజాశక్తి – ఆచంట

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు అంటే బెంచీలు, డస్కులు ఏర్పాటు, విద్యుత్, మంచినీటికి అధికారులు ప్రధాన్యమిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడంపై శ్రద్ధ వహించకపోవడంతో ఆ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడపక, సరైన రవాణా సదుపాయాలు లేక విద్యార్థులు ప్రతియేటా పాట్లు పడుతున్నారు. పదవ తరగతి పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ఎపిఎస్ఆర్‌టిసి పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు నడపడం లేదు. దీంతో విద్యార్థులకు ఏటా పాట్లు తప్పడం లేదు. ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు విద్యార్థులు అరకొర సౌకర్యాలతోనే పరీక్షా కేంద్రాలకు చేరుకోవలసిన దుస్థితి నెలకొంది. పరీక్షా కేంద్రాల్లో అధికారుల ఏర్పాట్లు బాగానే ఉన్నా ఆయా పరీక్ష సెంటర్లకు విద్యార్థులు వెల్లడమే ప్రధాన సమస్యగా మారింది. జిల్లాలోని అనేక మండలాల్లో విద్యార్థులు 5 నుంచి 10 కిలోమీటర్లకుపైగా ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు వెళ్లవలసి ఉంది. అయితే ఆయా ప్రాంతాలకు సక్రమమైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు యేటా పాట్లు పడుతున్నారు. ఈ తరహాలో విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గరుండి ఆటోలు లేదా ఇతర వాహనాలపై వారిని వెంటబెట్టుకుని తీసుకు వెళ్లవలసి వస్తుంది. ప్రయివేటు స్కూల్ వారు తమ స్కూల్ బస్సుల్లో విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం సొంతంగా వెళ్లవలసి వస్తుంది. ఉదాహరణకు ఆచంట మండలం కరుగోరుమిల్లి, పెనుమంచిలి గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడమంచిలి పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాయవలసి వస్తుంది. ఈ మార్గంలో బస్సులు, ఆటోల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు సైకిల్‌పై గాని, ఆటోలో గానీ కేంద్రానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇదేవిధంగా అనేక మండలాల్లోని విద్యార్థులు ఇతర గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల రోజుల్లో ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ వంటి సంఘాలు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌టిసి అధికారులు పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఇఒ–2 పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని 496 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద మంచినీరు ఏర్పాటుతోపాటు, వైద్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందుగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని కోరారు. ఆచంట, వల్లూరు, కొడమంచిలి, ఆచంట వేమవరం, జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆచంట విద్యార్థులు 105 మంది, స్థానిక స్మక్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన 10 మంది మొత్తం 115 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వల్లూరు ఎంపీ పాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 81 మంది, వేమలాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల చెందిన 27 మందితో కలిపి 108 మంది విద్యార్థులు, ఆచంట వేమవరం సెంటర్లో జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 59 మంది, కొడమంచిలి సెంటర్లో స్థానిక జెడ్‌పి విద్యార్థులు 73 మంది, పెనుమంచిలి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 35 మంది, కరుగోరుమిల్లి జెడ్‌పి విద్యార్థులు 33 మంది, కోడేరు జెడ్‌పి విద్యార్థులు 27 మంది, స్థానిక హెూలీ ఏంజిల్స్ ప్రయివేట్ పాఠశాలకు చెందిన 46 మందితో కలిపి 214 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

ఆటోలే దిక్కు

అంగర శ్రీలక్ష్మీ వాణి, పదవ తరగతి విద్యార్థిని, పెనుమంచిలి



నేను పెనుమంచిలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. పరీక్షా కేంద్రం 6 కిలోమీటర్ల దూరంలో కొడమంచిలిలో ఉంది. అక్కడకు వెళ్లాలంటే ఆటోలో వెళ్లాలి. పరీక్షల సమయంలో ఆర్‌టిసి ప్రత్యేకంగా బస్సు సర్వీసులు వేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

సైకిల్ పై వెళ్లాల్సి వస్తుంది

మంగిన రాధిక శ్రీవైష్ణవి, పదవ తరగతి విద్యార్థిని



నేను పెనుమంచిలి నుంచి కొడమంచిలి హై స్కూల్‌లోని పరీక్షా కేంద్రానికి సైకిల్‌పై వెళ్లవలసిందే. మిట్ట మధ్యాహ్నం పరీక్షలు ముగిసిన తర్వాత మండే ఎండలో ఇంటికి చేరాలి. తదుపరి పరీక్షకు ప్రిపేర్ కావాలంటే ఇబ్బంది. బస్సు సౌకర్యం ఉంటే ఎండ బాధ తప్పుతుంది.

ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడపాలి

అంగర విజయదుర్గ పదవ తరగతి విద్యార్థిని



పెనుమంచిలి నుంచి కొడమంచిలి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలంటే 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. సమీపంలో ఆచంట వేమవరం కేంద్రం మాకు సుమారు రెండు కిలోమీటర్లు. గతం నుంచి సమీప కేంద్రంలోకి మార్పు చేయాలని కోరుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు రవాణా సౌకర్యం లేక ప్రయివేటు వాహనాలు, ఆటో గాని, సైకిల్‌పై పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. అన్ని రోజులు ఇలాగే వెళ్లాలంటే విద్యార్థులు అవస్థలు తప్పడం లేదు.

వైఎన్‌కు అటానమస్ హోదా పొడిగింపు

ప్రజాశక్తి – నరసాపురం

వైఎన్ కళాశాలకు అటానమస్ స్టేటస్‌ను మరో 10 సంవత్సరాల వరకు పొడిగిస్తూ న్యూఢిల్లీ యుజిసి వారు ఉత్తర్వులు జారీజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ 2007, 2013, 2020 సంవత్సరాలలో మూడు పర్యాయాలు, 2020 సంవత్సరం నుంచి పిజి కోర్సెస్ కుడా అటానమస్ స్టేటస్‌ను ప్రతి 5 సంవత్సరాలకు ఇవ్వడం జరిగిందని, కానీ ఇప్పుడు నాలుగో పర్యాయం నాక్ ఏ ప్లస్ పొందిన కళాశాల కాబట్టి ఎటువంటి భౌతిక పరిశీలన లేకుండానే 10 సంవత్సరాల వరకు అటానమస్ స్టేటస్‌ను పొడిగిస్తూ యుజిసి వారు ఉత్తర్వులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్ మాట్లాడుతూ మన కళాశాలకు అటానమస్ స్టేటస్ వచ్చినప్పుడు నుంచి కూడా కోర్స్‌లను, సిలబస్‌లను ప్రస్తుత పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా మార్పులు చేసుకొంటున్నామని, పరీక్ష ఫలితాలను అనుకొన్న సమయానికి ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. తద్వారా అడ్మిషన్లు మెరుగుపరుచుకోవడం జరిగిందన్నారు. కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు మాట్లాడుతూ అటానమస్ స్టేటస్‌ను మరో 10 సంవత్సరాల వరకు పొడిగిస్తూ యుజిసి వారు ఉత్తర్వులు ఇవ్వడం సంతోషించ దగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఐక్యు ఎసి టీంని, ఇందుకు కృషి చేసిన వారిని అభినందించారు. ఈ సమావేశానికి గవర్నింగ్ బాడీ సభ్యులు, అకడమిక్ అడ్వైజర్ ఆర్‌వి.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, పిజి కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.చింతారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్, బెజవాడ వెంకట రత్నం, ఎంబిఎ హెడ్ డాక్టర్ ఆర్.పార్థసారథి పాల్గొన్నారు.

అమరావతికి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్

మాజీ మంత్రి జోగయ్య వ్యాఖ్యలు విచారకరం

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి – యలమంచిలి



జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

పిపిఎ పద్ధతి ద్వారా నిర్మితమవుతున్న రాష్ట్ర రాజధాని అమరావతి ద్వారా భవిష్యత్తులో రాష్ట్రానికి తిరిగి లక్ష కోట్ల రూపాయలకుపైగా ఆదాయం వస్తుందని, ఐతే రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.50 వేల కోట్లు కేటాయింపుపై మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య చేసిన విమర్శలు విచారకరమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం మండలంలోని మేడపాడు గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.82 లక్షలు, నేరేడుమిల్లి గ్రామంలో రూ.42 లక్షల నిధులతో చేపట్టబోయే పనులకు సంబంధించి నిమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నడూ జరగని అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, గత వైసిపి ప్రభుత్వం మూడు రాజదానులు అని చెప్పి ఒక్క రాజదానికి ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేకపోగా, రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు. ఆ సమయంలో ఎటువంటి విమర్శలు చేయని జోగయ్య లాంటి సీనియర్ నాయకులు ప్రస్తుత కూటమి సర్కార్‌పై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని, వైసిపి నాయకుల వలె జోగయ్య కూడా మాట్లాడడం తగదని, ఆయన అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉండాలే గాని రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించే విధంగా ఉండకూడదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణ రాజు, ముచ్చర్ల శ్రీనివాస్, కొడవటి సత్యవరబాబు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం




నరసాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి – పెనుమంట్ర

పరిసరాల్లో శుభ్రత పాటించడం వల్లే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నెగ్గిపూడి గ్రామ సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి అన్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర ప్రోగ్రాంలో భాగంగా స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లు, వీధులు శుభ్రం చేశారు. డ్రైనులు బాగుచేశారు. సెంటర్‌లో ఉన్న షాపులు అన్నటికి ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించి, నోటీసులను గ్రామ గ్రేడ్–1 కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి అల్లం బాలసాయి రెడ్డి, వార్డ్ సభ్యులు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీలు, ఆశాలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గణపవరం : పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండలపరిషత్ విస్తరణాధికారి పి.సత్యనారాయణ అన్నారు. శనివారం గణపవరం పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై నిర్మూలనపై జరిగిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గణపవరం బాలికల హైస్కూల్ విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాలకొల్లు రూరల్‌లో..

స్వచాంధ్ర సాదనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మీ అన్నారు. అవగాహనా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛ ఆసుపత్రి ఆరోగ్యానికి మైత్రి అని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. స్థానిక వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఎంఎఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రకృతికి హానికరమైన వన్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి అత్తింటి సోమశేఖర్, ఎంపిటిసి కె.గోవిందరాజు, పంచాయితీ కార్యదర్శి పి.సారిక, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఆరుగొలను నిర్వహించిన వేడుకల్లో సర్పంచి పీతల బుచ్చిబాబు, పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర పాల్గొన్నారు. వీరంపాలెం గ్రామంలో అవగాహనా ర్యాలీ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఎఎస్ఆర్ నగర్ పార్కు, వాటర్ ట్యాంక్ సమీపాన భీమవరం పురపాలక సంఘం అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్ వారి ఆధ్వర్యంలో సింగిల్ యుజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల వాడకంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సదరు కార్యక్రమానికి సమీప వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌ఛార్జి వారు, అన్ని డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రులు, మెప్మా సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిహెచ్‌సి ఆధ్వర్యాన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తీసుకునే ఆహారపు వస్తువులలో ప్లాస్టిక్ ఉత్పత్తులతో తీసుకుంటే కేన్సర్ బారిన పడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్‌పి.ఎలిజిబెత్, సూపర్వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, జి.ఉదయ్ చందర్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు పాల్గొన్నారు.



గణపవరంలో..

వీరవాసరం : ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండి ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీరవాసరం గ్రామ పంచాయతీ ఏరియాలోని షాప్‌లు తనిఖీ చేసి పాలిథిన్ సంచులను వినియోగిస్తున్న 3 షాప్‌ల యజమానులకు అపరాధ రుసుము వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

నరసాపురం : స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ఈ కార్యాచరణను చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని సమాజాన్ని శుభ్రంగా ఉంచేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని, క్యాంపస్ మొత్తం పరిశుభ్రత కార్యకలాపాలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విస్సా మాణిక్యాలరావు, ఎంవి.కృష్ణ మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, ఎస్‌హెచ్ విభాగం అధిపతి డాక్టర్ వి.స్వామినాథం పాల్గొన్నారు.

పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొన్నారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదగా గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ప్రవీణ్ చంద్ర, ఆర్ఐ నానాజీ, ఎఇ నవ్య కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి : మండల వ్యాప్తంగా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు ఆధ్వర్యంలో చర్చి వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామంలో పారిశుధ్య నిర్మూలనకు కృషి చేయాలని, తమ ఇళ్ల వద్ద ఎప్పుడైనా చెత్తను గ్రామపంచాయతీ, పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. గ్రామం పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో శనివారం తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణిల ఆధ్వర్యంలో సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రభుత్వం చేపట్టిన మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిపి సంధ్య, ఇన్‌ఛార్జి ఆర్ఐ ముచ్చర్ల నిరంజన్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



మొగల్తూరులో..

అభివృద్ధి కార్యక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి – పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఏటా వైట్ పేపర్ విడుదల చేయాలని కాపు బలిజ సేన సమితి వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి రూ.50 వేల కోట్లతో సమగ్రాభివృద్ధి చేస్తోందని, శాసనసభతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు రాజధానిలో ఉన్నందున అన్ని నిధులు ఖర్చు చేయాలని చెప్పారు. పవన్ కళ్యాణ్ గోదావరి జిల్లాల్లో వారాహీ యాత్ర సందర్భంగా జిల్లాను దత్తత తీసుకుంటానని చెప్పారని, అయితే గత తొమ్మిది నెలలుగా జిల్లాలో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించారో ప్రజలకు తెలిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

28న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న న్యూఢిల్లీలో పార్లమెంటు ఎదుట జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు పిలుపునిచ్చారు. భవననిర్మాణ కార్మికుల ఛలో న్యూఢిల్లీ ధర్నా పోస్టరును సిఫాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో యూనియన్ నాయకులు శనివారం ఆవిష్కరించారు. జిల్లా యూనియన్ నాయకులు మెండెం జేమ్స్, కోడె సాయి బాలాజీ, ఏరియా కమిటీ గౌరవాధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల నుంచి తణుకుకు టిడిపి శ్రేణులు శనివారం తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న సమావేశానికి ఆ పార్టీ మొగల్తూరు గ్రామ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు పర్యవేక్షణలో గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు తరలి వెళ్లారు.

అన్నసమారాధనలో యాత్రికులు

మొగల్తూరు : పేరుపాలెం సౌత్‌లోని మొళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో ఉన్న మత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్నదాన కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

కేంద్ర మంత్రి వర్మకు పరామర్శ

నరసాపురం : నరసాపురం ఎంపీ, కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ బుధవారం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను శనివారం భీమవరంలో ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పులిహోర, చక్కెర పొంగలి పంపిణీ

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం నార్త్ గ్రామంలో ఉన్న పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పులిహోర, చక్కెర పొంగలి, ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామంలో ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన చెన్నప్రగడ కృష్ణమూర్తి, అన్నపూర్ణ దంపతులచే శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పులిహోర, చక్రపొంగలి ప్రసాద వితరణ చేశారు. ఆయా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి శనివారం ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది కలిసి గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో దాడులు నిర్వహించి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 07 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE
Ist ADDL DISTRICT JUDGE
AT: SANGAREDDY
O.S.No. 42 OF 2015

BETWEEN:
Shaik Faqruddin
...Plaintiff
AND
1. K.Ravi Kumar and others
....Defendants

To,
7. Katari Rama Krishna Raju S/o Late Rama SuryanarayanaRaju, Aged 63 years, Occ: Agriculture, R/o H.No. 2-147, Panchayath Road, Opp: Water tank, Palakoderu Mandalam, Kumudavalli, West Godavari District. 534 210.
10. Smt.VasamsettyMahwswari W/o Gopala Krishna, Aged about 5 years, Occ: House wife, R/o H.No:5-375/1, Guru Nagar, Bommuru, East Godavari District.

NOTICE

Take notice that the above named Plaintiff filed the suit for specific performance contract in respect of the suit schedule property on the file of Hon'ble Ist Addl. district and session Judge at Sangareddy. The said case is posted to **28-03-2025** at **10-30** A.M for your appearance by person or through an advocate, failing which the case will be decided in your absence on merits against you.

// BY ORDER OF COURT //

M. GIRIDHAR
Advocate
Sangareddy